క్లుప్తంగా

నామినేషన్ పత్రాలతో ఆలయంలో పూజలు

చిలుకూరు బాలాజీని దర్శించుకున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య


చిలుకూరులో అర్చకుడు రంగరాజన్ ఆశీర్వాదం తీసుకుంటున్న కాలె యాదయ్య

మొయినాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. గురువారం నామినేషన్ వేసేందుకు వెళ్లే ముందు ఆయన నామినేషన్ పత్రాలకు పూజ చేయించారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ ఆశీర్వాదం తీసుకుని వెళ్లారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, ఆంద్రూ, జయవంత్, చెన్నయ్య, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో పది నామినేషన్లు

షాద్‌నగర్: షాద్‌నగర్‌లో గురువారం పది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట మాధవ రావు తెలిపారు. తుప్పుడు నర్సయ్య (స్వతంత్ర), పి.విష్ణువర్ధన్‌రెడ్డి (ఆల్ ఇండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీ), మద్దెల చంద్రమౌళి (స్వతంత్ర), నర్సింహ్మా రుస్తుం (స్వతంత్ర), పి.ప్రశాంత్‌కుమార్ (బీఎస్‌పీ), అందెబాబయ్య (బీజేపీ), వినయ్‌కుమార్ (విద్యార్థుల రాజకీయ పార్టీ), పి. సత్యనారాయణరెడ్డి (స్వతంత్ర), కే.రాము (బహుజన్ సమాజ్ పార్టీ), అందారి అంజయ్య (స్వతంత్ర) నామినేషన్లను దాఖలు చేశారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహా


మాట్లాడుతున్న చిలకరమర్రి నర్సింహా

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్రాని అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌కు మరోసారి ఓటు వేసి గెలిపించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహా అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలించిన పాలకులు చేయలేని అభివృద్ధిని బీఆర్‌ఎస్ చేసి చూపించిందన్నారు. ప్రస్తుత తరుణంలో ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వాలను ఎన్నుకోవాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ గుప్పించే మోసపూరిత హామీలను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో హుమ్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే అభ్యర్థి అందెబాబాయ్య


ఎన్నికల ప్రచారంలో భాగంగా బతుకమ్మ ఆడుతున్న అందె బాబాయ్య

కేశంపేట: బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి అందె బాబాయ్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, బైర్కాన్‌పల్లి, మంగళిగూడ, కొత్తపేట, అల్వాల, కొనాయపల్లి, బోధునంపల్లి, లేమామిడి, నిర్ధాలి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధుతో రైతులనే మోసం చేస్తుందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శ్రీవర్ధన్‌రెడ్డి, మోటే శ్రీను, రఘురాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు


బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్: కిషన్‌నగర్‌లో కాంగ్రెస్‌కి చెందిన పలువురు నేతలు గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివరాములు, సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్ బీఆర్‌ఎస్ యువనేత మురళీ కృష్ణ యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ శ్రీలత, పాల్గొన్నారు.


మొయినాబాద్‌లో నిరుపయోగంగా బీసీ బాలికల హాస్టల్ భవనం


పెద్దమంగళారంలో నిరుపయోగంగా మారిన ఎస్సీ బాలుర హాస్టల్ భవనం

ప్రభుత్వ భవనాలు.. నిరుపయోగం!

అనాలోచితంగా నిర్మాణాలు
- రూ.లక్షల్లో ప్రభుత్వ ధనం వృథా
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్: లక్షల రూపాయలను వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన ప్రభుత్వ భవనాలు నేడు వృథాగా మారుతున్నాయి. భవనాలను అనువైన చోట నిర్మించక పోవడంతోనే అవి దేనికి పనికి రాకుండ మారాయి. కనీసం ఇతర అవసరాలకైనా వాడకపోవడంతో అవి నిరుపయోగంగా మిగిలిపోతున్నాయి. విద్యార్థులకు ఉపయోగపడేలా నిర్మించాల్సిన భవనాలను అనాలోచితంగా ఎక్కడపడితే అక్కడ నిర్మాణాలు చేపట్టారు. మొయినాబాద్ మండల కేంద్రంలో బీసీ బాలికల వసతి గృహం భవనాన్ని పద్నాలుగేళ్ల క్రితం రూ.40 లక్షలు ఖర్చుచేసి నిర్మించారు. దీన్ని జనవాసాలకు దూరంగా స్మశానవాటిక పక్కన నిర్మించారు. దీంతో విద్యార్థినులు హాస్టల్ భవనంలోకి వెళ్లేందుకు జంకుతున్నారు. అక్కడికి ఎవరు కూడా వెళ్లకపోవడంతో ఆ భవనాన్ని వదిలేశారు. ప్రస్తుతం ఆ భవనానికి తలుపులు, కిటికీలు ఉన్నా ఇనుప గ్రిల్స్‌ను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఎనిమిదేళ్ల క్రితమే మొయినాబాద్‌లో బీసీ బాలికల హాస్టల్‌ను ప్రభుత్వం పూర్తిగా ఎత్తేసింది. ఇక హాస్టల్ కోసం నిర్మించిన భవనాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదు.

పెద్దమంగళారంలో...

మండల పరిధిలోని పెద్దమంగళారంలో ఎస్సీ బాలురకు వసతి గృహం కోసం నిర్మించిన భవనం కూడా వృథాగా మారింది. ఎనిమిదేళ్ల క్రితం హాస్టల్ మూతపడటంతో ఆ భవనాన్ని ఎలాంటి ఉపయోగానికి సైతం వాడకుండా వదిలేశారు. కొంత కాలం పాటు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను అందులో నిర్వహించారు. ఆ భవనంలో స్థలం సరిపోవడంలేదని ప్రైవేటు భవనంలోకి గురుకులాన్ని తరలించారు. దీంతో ఆ భవనం ఇప్పుడు ఖాళీగానే ఉంది. హిమాయత్‌నగర్‌లో పదిహేనేళ్లక్రితం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకోసం మూడు అదనపు గదులను రూ.10 లక్షల వ్యయంతో నిర్మించారు. పాఠశాలకు అది దూరంగా ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అక్కడికి వెళ్లడంలేదు. దీంతో వాటిని నిరుపయోగంగా వదిలేశారు. అందులో ఒక గదిని మాత్రమే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరఫీ చేసేందుకు ఉపయోగిస్తున్నారు. ఇక సురంగల్ గ్రామంలో పదేళ్ల క్రితం రూ.5 లక్షలతో అంగన్‌వాడీ భవనాన్ని సైతం ఇదే తరహాలో అనాలోచితంగా నిర్మించారు. అంగన్‌వాడీ భవనం గ్రామంలో నిర్మించాల్సి ఉండగా గ్రామానికి కిలోమీటర్ దూరంలో నిర్మించారు. అంగన్‌వాడీ చిన్నారులు అంతదూరం నడిచి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో భవనాన్ని వృథాగా వదిలేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే ఇలా అనాలోచితంగా భవనాలు నిర్మించి వదిలేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నామినేషన్‌కు భారీ ర్యాలీ

షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: చేవెళ్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య నామినేషన్ సందర్భంగా జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి భారీ ర్యాలీతో వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య విజయం ఎప్పుడో ఖాయమైందన్నారు. కేవలం భారీ మెజార్టీ కోసమే పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ రావాలని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్, మాజీ చైర్మన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, పొన్న నర్సింహారెడ్డి, వెంకటయ్య, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, టీఎల్‌ఎఫ్ జిల్లా లీగల్ అడ్వైజర్ పీసరి సతీశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిర్వహించిన ర్యాలీకి మండల బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పెద్ద ఎత్తున జన సమీకరణతో తరళారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి గౌడిచర్ల నర్సింహా, మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్‌ఖన్నా, మాజీ మండల అధ్యక్షుడు గౌడిచర్ల నర్సింహా, సర్పంచ్ లలిత తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ గెలుపును ఎవరు ఆపలేరని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్ అన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హ్యాట్రిక్ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య నామినేషన్ సందర్భంగా హిమాయత్‌నగర్ గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి హిమాయత్‌నగర్ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించి చేవెళ్లకు బయలుదేరారు. మాల యాదయ్య, రాజు, రాఘవేందర్, చెన్నయ్య, అప్పోజిగూడ రాజు, హిమాయత్‌నగర్ పాల్గొన్నారు.


షాబాద్: ర్యాలీలో పాల్గొన్న జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

తొమ్మిదేళ్లలో ఎంతో చేశాం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


పర్వతాపూర్ ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: తొమ్మిదేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కొందుర్గు మండల కేంద్రంతోపాటు అయోధ్యపూర్ తండా, పుల్లప్పగూడ, చిన్నఎల్కిచర్ల, శ్రీరంగాపూర్, పర్వతాపూర్, ఉమ్మెంత్యాల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను ఇప్పటివరకు అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు వేయించానని, గ్రామాల్లో సీసీ రోడ్లు వేయించినట్లు చెప్పారు. ఇంటింటికి తాగునీటిని అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మరోసారి తనకు అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

అధికారం ఇస్తే అభివృద్ధి చేస్తాం

చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం సతీమణి ప్రమీల


షాబాద్: ఎల్గొండగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కేఎస్ రత్నం సతీమణి ప్రమీల

షాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, బీజేపీకి అధికారమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం సతీమణి ప్రమీల పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని ఎల్గొండగూడ, ఆస్పల్లిగూడ, చర్లగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో తుగ్లక్ పాలనకు ప్రజలు చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ఓటర్లు మేల్కొని కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కిరణ్, క్యామ నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు


బీజేపీలో చేరుతున్న నాయకులను ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

మొయినాబాద్: వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, బీజేపీలో చేరారు. గురువారం మొయినాబాద్‌లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌గౌడ్, శ్రీరాంనగర్ మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, కొత్త మాధవరెడ్డి, వెంకటాపూర్ బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు భరత్‌కుమార్, మేడిపల్లికి చెందిన కొంత మంది యువకులకు మాజీ ఎమ్మెల్యే రత్నం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు గున్నాల గోపాల్‌రెడ్డి, క్యామ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పనిచేసేవారికి గుర్తింపు లేదు: గ్రామ కమిటీ అధ్యక్షుడు భరత్‌కుమార్

బీఆర్‌ఎస్‌లో పనిచేసే కార్యకర్తలకు సరైన గుర్తింపు లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడి వ్యవహారం అహంకార పూరితంగా ఉండడంతోనే తను బీజేపీలో చేరినట్టు భరత్‌కుమార్ ఆరోపించారు.

యజ్ఞయాగాలతో భక్తిభావం

శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద


మాట్లాడుతున్న శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద, బండారి రమేష్ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: శాంతిస్థాపనకోసం చేపట్టే యజ్ఞయాగాలు భక్తిభావాన్ని పెంపొందిస్తాయని శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద అన్నారు. పట్టణ సమీపంలో 14 రోజులుగా ఆయుతచండీ అతిరుద్ర మహాయాగం (సత్రయాగం) నిర్వహించారు. గురువారం ముగింపు సందర్భంగా రాధాకృష్ణుల పట్టాభిషేకం, ఉట్లు కొట్టడం, కుంకుమార్చన, పుష్పార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద మాట్లాడుతూ.. మనం చేపట్టే యజ్ఞయాగాదులు విశ్వశాంతిని నెలకొల్పుతాయని అన్నారు. దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని యాగాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. హిందూ ధార్మిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర క్యాదర్శి బండారి రమేష్ మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. యువత నవసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అన్నారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మోహన్, బెజుగం రమేష్, రాధేశ్యాం, గందె సురేష్, సాయిశ్వర్‌రెడ్డి, టాప్సన్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'గ్యారంటీ'గా అమలు చేస్తాం

- గెలుపుకోసం కృషి చేయండి
- ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్
- బీఆర్‌ఎస్ నాయకుల చేరికలు


శంకర్‌పల్లి: కాంగ్రెస్‌లో చేరిన రామంతపురం మాజీ సర్పంచ్ నర్సింలు

శంకర్‌పల్లి: ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ అభ్యర్థి భీంభరత్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని రామంతపురం మాజీ సర్పంచ్ నర్సింలు తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి భీంభరత్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. అధికార పార్టీ నుంచి పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. శ్రీశైలం, రాంచంద్రయ్య. భూషణం, కిష్టయ్య, ప్రవీణ్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్‌కి ఆదరణ..

గ్రామాల్లో కాంగ్రెస్‌కి మంచి ఆదరణ ఉందని పీసీసీ కార్యదర్శి కె.ఉదయమోహన్‌రెడ్డి అన్నారు. ఇరుకుంటతండా, పల్లిగుండ్ల, పొన్నగట్టుతండాల్లో పార్టీ అభ్యర్థి భీంభరత్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ప్రకాష్‌గుప్తా, బండల ఉపాధ్యక్షుడు రవిందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేసి తీరుతామని సీనియర్ నాయకుడు కీసరి సంజీవ రెడ్డి అన్నారు. నాగిరెడ్డిగూడలో కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌ను గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి చేతి గుర్తుకు ఓటు వేయాలని ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో అశోక్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లేడ్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొందుర్గులో..

కొందుర్గు: ఇందిరమ్మ రాజ్యం వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని కాంగ్రెస్ జిల్లేడ్ చౌదరిగూడ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు అన్నారు. జిల్లేడ్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వేణుగోపాల్, భాస్కర్, జంగయ్య, గిరిధర్, శశిధర్, పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, ఎన్కెపల్లి మాజీ సర్పంచ్ అమర్‌నాథ్ రెడ్డి, సీనియర్ నాయకుడు బిస నర్సింహ్మముదిరాజ్‌లు పేర్కొన్నారు. ఎన్కెపల్లి, హిమాయత్‌నగర్ ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనకు ఇక ముగింపు పలుకుతామన్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

న్యాయం చేయాలని మృతురాలి బంధువుల ఆందోళన

కొత్తూరు: వేధింపులు తాళలేక భార్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మక్తగూడ పంచాయతీ పెద్దగుట్టతండాలో చోటు చేసుకుంది. సీఐ శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..తండాకు చెందిన ముడావత్‌బాబు, రుక్కమ్మ(35)లకు 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిరువురు తండాలోనే తమ పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో భర్తకు వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు చోటు చేసుకునేవి. దీంతో రుక్కమ్మ భర్త గురువారం పొలానికి వెళ్లగా ఆమె ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుంది. సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన వారి కుమారులు దీన్ని గమనించి తండ్రికి సమాచారం చేరవేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు తండాకు చేరుకుని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతురాలి తండ్రి చంద్రు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గోడ కూలి వ్యక్తి మృతి


కింకర్‌ప్రధాన్ (ఫైల్)

శంకర్‌పల్లి: గోడ కూలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. మిడ్నాపూర్, వెస్ట్‌బెంగాల్‌కి చెందిన కింకర్ ప్రధాన్(62) కొండకల్ అర్బన్ ట్రిల్ల ప్రాజెక్ట్ అపార్ట్‌మెంట్‌లో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. గ్రౌండ్ ఫ్లోర్‌లో లేబర్‌తో మాట్లాడుతుండగా 6వ అంతస్తులో పిన్ వాల్ కూలి అతనిపై సిమెంట్ ఇటుకలు పడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆరోగ్యంతోనే సత్ఫలితాలు

ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఉత్తమ ఫలితాలను సాధిస్తారని ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయలక్ష్మి అన్నారు. గురువారం రాయికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రెడ్డి ల్యాబ్స్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు జంక్‌ఫుడ్ తీసుకోవద్దని, కూల్ డ్రింక్స్, పొగాకు, మద్యపానం, ధూమపానం వంటి వ్యసనాల బారిన పడొదన్నారు. ప్రతి విద్యార్థి చదువుల్లో రాణించి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థినులకు హెల్త్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి ల్యాబ్ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలను నమ్మరు

- కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యం
- మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి


కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

షాద్‌నగర్: ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మధురాపూర్ సర్పంచ్ శివారెడ్డి ఆధ్వర్యంలో మంగలిగడ్డ తండాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రెండు పార్టీలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. సీఎం కేసీఆర్ చెప్పే మాయమాటలను నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించిన మహేశ్

తలకొండపల్లి: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని, ప్రతిఒక్కరూ కరాటే నేర్చుకోవాలని కరాటే మాస్టర్ మహేశ్ సూచించారు. బాలబాలికలందరూ కరాటే తప్పనిసరిగా నేరుకోవాలన్నారు. గురువారం మండల పరిధిలోని చుక్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల్లో డీఈఓ ఆదేశాలతో ఉచిత కరాటే శిక్షణ తరగతులను ఆయన, హెచ్‌ఎం రామనాథంతో కలిసి ప్రారంభించారు. అమ్మాయిలపై జరుగుతున్న దాడులను ఎలా ఎదుర్కోవాలి.. విపత్కర పరిస్థితుల్లో ఎలా బయటపడాలో.. అనే దానిపై మెళుకువలు నేర్పుతూ శిక్షణ తరగతులను ప్రారంభించారు. బాలికలకు ఆపద వచ్చినప్పుడు కరాటే ఆత్మరక్షణగా ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.